

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. నేడు రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా ఈ సినిమాలోని 'జరగండి' అనే పాటను విడుదల చేయబోతున్నారు. 150 థియేటర్లలో ఈ పాటను ప్రదర్శించబోతున్నారు. ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, దర్శకత్వం: శంకర్.

# లక్నోలో డిష్యుం.. డిష్యుం..



జయాపజయాలకు అతీతంగా వేగంగా సినిమాలు చేసుకుంటూ దూసుకుపోతున్నారు రవితేజ. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈచిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. తాజాగా షెడ్యూల్‌ని లక్నోలో మొదలుపెట్టారు. ఈ కీలక షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరించనున్నారు హరీశ్‌శంకర్. 'నామ్ తో సునా హోగా' అనే ఉపశీర్షికతో రూపొందుతోన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో సరికొత్త రవితేజను ఆడియన్స్ చూస్తారని హరీశ్‌శంకర్ చెబుతున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టి.జి.విశ్వప్రసాద్.

# ఆమెతో పోలిక ఆనందమే



మలయాళంలో లేటెస్ట్ హిట్ 'ప్రేమలు' చిత్రంతో యువతరం గుండెల్లో గూడు కట్టేసుకుంది మమితా బైజు. కేవలం ఈ అమ్మాయి కోసమే 'ప్రేమలు' సినిమాను మళ్లీ మళ్లీ చూస్తున్నారు యూత్. ప్రస్తుతం ఈ కేరళ అందాన్ని తెలుగులోకి లాగేయడానికి చాలామంది దర్శక, నిర్మాతలు ప్రయత్నాలు కూడా ముమ్మరం చేశారని సమాచారం. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ వేడుకలో పాల్గొన్న ఈ బంగారు బొమ్మ తన కెరీర్ గురించి ఆసక్తికరమైన విషయాలు తెలిపారు. 'చిన్నప్పట్నుంచీ యాక్టింగ్ అంటే ఇష్టం. 'సర్వోపరి పలక్కరన్' నా తొలి సినిమా. ఆ తర్వాత చాలా సినిమాల్లో నటించాను. షార్ట్ ఫిల్మ్ కూడా చేశాను. కానీ 'ప్రేమలు' నన్ను ప్రపంచానికి పరిచయం చేసింది. తమిళంలో జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న 'రెబల్' సినిమాలో చేస్తున్నాను. అవకాశాలు చాలానే వస్తున్నాయి కానీ, అన్నీ చేయను. నచ్చితేనే చేస్తా.' అంటూ చెప్పుకొచ్చింది మమిత. మిమ్మల్ని చాలామంది సాయిపల్లవితో పోలుస్తున్నారు? పైగా మీరే సాయిపల్లవికి సరైన పోటీ అనే టాక్ కూడా నడుస్తున్నది? దీనిపై మీ అభిప్రాయం? అనడిగితే 'ఆమె గ్రేట్ ఆర్టిస్ట్. నాకు ఇన్‌స్పిరేషన్. అలాంటి మంచి యాక్టస్‌తో పోలుస్తున్నారంటే ఆనందమేగా!? ఇక పోటీ అంటారా? నా కెరీర్ మొదలైందే ఇప్పుడు.. అప్పుడే పోటీ దాకా ఎందుకు..' అంటూ అందంగా నవ్వేసింది మమిత.



# వివరాలు తెలిపేది అప్పుడే..


చేయబోయే సినిమా గురించి ముందుగానే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడటం రాజమౌళి స్టయిల్. మహేశ్‌బాబుతో సినిమా అనుకున్నప్పట్నుంచీ ఈ సినిమా గురించి రకరకాల పుకార్లు షికార్లు చేస్తూనేవున్నాయి. వాటితో పాటు రాజమౌళి, విజయేంద్రప్రసాద్, కార్తికేయ లాంటి వాళ్లు వేడుకల్లో చిన్న చిన్న లీకులిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతూనేవున్నారు. అయితే.. అసలైన సమాచారం ఎప్పుడొస్తుంది?. రాజమౌళి ఎప్పుడు ప్రెస్‌మీట్ పెట్టబోతున్నారు? అనే ప్రశ్నలు మాత్రం ప్రేక్షకుల్లో లేకపోలేదు. నిజానికి ఏప్రిల్ 9న ఉగాది సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన తొలి ప్రెస్‌మీట్‌ని రాజమౌళి నిర్వహించనున్నట్టు గతంలో వార్తలొచ్చాయి. అయితే.. సన్నిహిత వర్గాల సమాచారం ప్రకారం ఉగాదికి ప్రెస్‌మీట్ పెట్టడంలేదట. మహేశ్‌బాబు పుట్టినరోజైన ఆగస్ట్ 9న ప్రెస్‌మీట్ నిర్వహించనున్నారట. ఆ రోజునే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ని కూడా విడుదల చేయనున్నట్టు సన్నిహిత వర్గాల సమాచారం. ట్రెజర్ హంట్ కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ ఇప్పటికే మొదలైంది. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో పాన్ వరల్డ్ స్థాయి సినిమాగా ఈ చిత్రం రూపొందనుంది. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో తెలియనున్నాయి.

# ఎడారి జీవితాన్ని సజీవంగా చూపించాం

**'ది గోట్ లైఫ్' సినిమా కోసం చాలా అవకాశాలను వదులుకున్నానని, ఓ గొప్ప సినిమా కోసం అలాంటి త్యాగాలు తప్పవని అన్నారు మలయాళ అగ్ర హీరో పృథ్వీరాజ్ సుకుమారన్. ఆయన తాజా చిత్రం 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం) పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమార్ చెప్పిన సినిమా సంగతులు..**



- 90వ దశకంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన నజీబ్ అనే వ్యక్తి జీవితం ఆధారంగా రచయిత బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' అనే పుస్తకానికి దృశ్యరూపమే ఈ సినిమా. కేరళలో అనూహ్య పాఠకాదరణ పొందిన ఈ పుస్తకం సినిమా హక్కుల కోసం అగ్ర దర్శక నిర్మాతలు, హీరోలు పోటీపడ్డారు. ఈ కథతో దర్శకుడు బ్లెస్సీ 2008లో నన్ను సంప్రదించాడు. అలా 'ది గోట్ లైఫ్'తో నా ప్రయాణం మొదలైంది.
- 2018లో సినిమా షూటింగ్‌ను మొదలుపెట్టాం. తొలుత రాజస్థాన్ ఏడారిలో షూటింగ్ చేయాలనుకున్నాం. అయితే అక్కడ అరబ్ ఏడారుల వాతావరణం కనిపించలేదు. దాంతో జోర్డాన్ వెళ్లి చిత్రీకరణ జరిపాం. ఈ సినిమాలోని ఓ ఎపిసోడ్ కోసం 31 కిలోలకుపైగా బరువు తగ్గాల్సి వచ్చింది. అందుకోసం షూటింగ్‌కు ఏడు నెలల విరామం తీసుకున్నా.
- షూటింగ్ టైంలో లాక్‌డౌన్ వచ్చింది. అప్పుడు మేము జోర్డాన్‌లో చిత్రీకరణ జరుపుతున్నాం. వందేభారత్ ఫ్లైట్‌లో కేరళ చేరుకున్నాం. ఏడాదిన్నర తర్వాత అల్జీరియా సహారా ఏడారిలో చిత్రీకరణ తిరిగి ప్రారంభించాం. ఇలా ఎన్నో కష్టాలు పడి అరుదైన లొకేషన్లలో చిత్రీకరణ పూర్తి చేశాం. రెండేళ్లలో పూర్తి కావాల్సిన ఈ చిత్రం కోవిడ్ వల్ల ఆలస్యమైంది
- నజీబ్ పాత్రలో సహజత్వం కనిపించేందుకు ప్రయత్నించాను. ఓ రకంగా చెప్పాలంటే ఆయన పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశాను. ఈ క్యారెక్టర్ కోసం కఠినమైన ఆహార నియమాలు పాటించా. ఈ క్రమంలో నా ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యులు ఎంతగానో ఆందోళన చెందారు. అయితే సినిమా కోసం నేను చేస్తున్న ప్రయత్నాలు అర్థం చేసుకొని మద్దతుగా నిలిచారు.
- ప్రేక్షకులకు ఓ గొప్ప సినిమాను అందివ్వబోతున్నామనే నమ్మకంతోనే దాదాపు 16 ఏళ్లుగా ఈ సినిమాతో ప్రయాణం చేశాను. ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు నాకు వచ్చిన కొన్ని అవకాశాలను వదిలేశాను. ఇలాంటి అరుదైన సినిమాలు చేస్తున్నప్పుడు మిగతా ఆఫర్స్ వదులుకోవడం తప్పుకాదు.
- ఈ సినిమాలో ఏడారి జీవితాన్ని సజీవంగా చూపించాం. అందుకోసం మా టీమ్ ప్రతిభావంతంగా పనిచేసింది. ఈ సినిమా తెలుగు డబ్బింగ్ విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నాం. తెలుగులో నేను సొంతంగా డబ్బింగ్ చెప్పాను. తెలుగు పాటలు, సంభాషణల విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకున్నాం.



# విలువిద్యలో శిక్షణ

'యానిమల్' సినిమాతో కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌ను సొంతం చేసుకున్నారు అగ్ర హీరో రణ్‌బీర్‌కపూర్. ప్రస్తుతం ఆయన పౌరాణిక ఇతిహాసం రామాయణం కోసం సన్నద్ధమవుతున్నారు. నితేష్ తివారి దర్శకత్వంలో పాన్ ఇండియ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. సీత పాత్రలో సాయిపల్లవి నటించనుంది. కన్నడ అగ్ర హీరో యష్ రావణాసురుడి పాత్రను పోషించనున్నట్లు వార్తలొస్తున్నాయి. మూడు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పూర్వ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేశారు. రాముడి పాత్ర కోసం రణ్‌బీర్‌కపూర్ విలువిద్యలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ ఫొటోలను ఆర్చరీ కోచ్ తన సోషల్‌మీడియా ఖాతాల్లో పోస్ట్ చేశారు. దీంతో 'రామాయణం' చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమవుతున్నదని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్‌లో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. ప్రస్తుతం రణ్‌బీర్‌కపూర్..సంజయ్‌లీలా భన్సాలీ రూపొందిస్తున్న మల్టీస్టారర్ ప్రేమ కథా చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు.



# ఇక నా మాటే..

శర్వానంద్ కథానాయకుడిగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'మనమే'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కృతిశెట్టి కథానాయికగా నటిస్తున్నది. ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మొదలుపెట్టారు. ఈ చిత్రంలోని తొలిగీతం 'ఇక నా మాటే..' ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో శర్వానంద్ ట్రెండీ లుక్‌లో కనిపిస్తున్నారు. యూనిక్ కాన్సెప్ట్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, శర్వానంద్ పాత్ర వైవిధ్యంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: విష్ణుశర్మ, జ్ఞానశేఖర్ వీఎస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, సహ నిర్మాత: వివేక్ కూచిబొట్ల, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీరామ్ ఆదిత్య.



# కండిషన్స్ తెచ్చిన తంట

వెరైటీ సినిమాల కేరాఫ్ అడ్రస్ విజయ్ ఆంటోనీ నటిస్తున్న సినిమా 'లవ్ గురు'. మృణాళిని రవి కథానాయిక. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ నిర్మిస్తున్న ఈ చిత్రం మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా రంజాన్ పండుగ సందర్భంగా ఏప్రిల్ 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. తండ్రి పోరు పడలేక పెళ్లికి ఒప్పుకున్న ప్రియ.. పెళ్లి చూపుల టైమ్‌లో తనను చూడ్డానికి వచ్చిన కుర్రాడికి కొన్ని కండిషన్స్ పెడుతుంది. అమ్మాయి నచ్చడంతో ఆ కండిషన్స్ అన్నింటికీ ఆ కుర్రాడు తలూపాడు. పెళ్లయ్యాక ఆ కండీషన్స్ వల్ల కలిగే ఇబ్బందులు అర్థమయ్యాయి. ఆ ఇబ్బందుల నుంచి హీరో ఎలా బయటపడ్డాడు?.. ఈ అంశాలన్నీ ట్రైలర్‌లో కనిపిస్తున్నాయి. యూత్‌తోపాటు ఫ్యామిలీ ఆడియన్స్‌కి కూడా నచ్చేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. వీటీవీ గణేశ్, తలైవాసల్ విజయ్, ఇళవరసు, సుధ, శ్రీజ రవి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఫరూక్ జె.భాష, సంగీతం: భరత్ ధనశేఖర్, సమర్పణ: మీరా విజయ్ ఆంటోనీ, నిర్మాత, ఎడిటింగ్, విజయ్ ఆంటోనీ, నిర్మాణం: విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్.



# తెలుగులో 'మంజుమ్మెల్ బాయ్స్'

ఇటీవల మలయాళంలో విడుదలైన 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్రం సంచలన విజయం సాధించింది. కొడైకెనాల్‌లోని గుణ గుహ నేపథ్యంలో సర్వైవల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చిదంబరం ఎస్ పొదువల్ దర్శకత్వం వహించారు. దేశవ్యాప్తంగా చక్కటి ఆదరణ సొంతం చేసుకున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ఏప్రిల్ 6న తెలుగులో విడుదల చేస్తున్నది. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 2006లో ఎర్నాకులం మంజుమ్మెల్ అనే పట్టణానికి చెందిన యువకులు కొడైకెనాల్ విహార యాత్రకు వెళతారు. అక్కడ గుణ కేవ్‌లో మిత్రబృందంలోని ఓ యువకుడు చిక్కుకుపోతాడు. అతన్ని రక్షించడానికి చేసిన ప్రయత్నాలు ఏమిటన్నదే చిత్ర కథాంశం. స్నేహం, అడ్వెంచర్ నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగుతంది. తెలుగు వెర్షన్‌ను భారీ స్థాయిలో విడుదల చేస్తున్నామని మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: ఫైజు ఖలీద్, సంగీతం: సుశీన్ శ్యామ్, రచన–దర్శకత్వం: చిదంబరం.

# అలాంటి కళారూపాలు రావాలి



'కె.విశ్వనాథ్‌గారి సినిమాలు మా జనరేషన్‌ని బాగా ఇన్‌స్పైర్ చేశాయి. ఆయన సినిమాల్లో మంజుభార్గవి, భానుప్రియ క్లాసికల్ డాన్సులు చూసి, డాన్స్‌మీద ఇష్టం పెరిగి, మేం కూడా క్లాసికల్ డాన్స్ నేర్చుకున్నాం. మన కళల్ని ముందు తరాలకు చేర్చగలిగాం. అలా ఇన్‌స్పైర్ చేసే సినిమాలు, కళా రూపాలు ఇప్పుడు రావాల్సిన అవసరం ఉంది' అంటున్నారు నటి ప్రశాంతి హారతి. పెళ్లాం ఊరెళితే, ఇంద్ర చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె పెళ్లి తర్వాత యూఎస్‌లో సెటిల్ అయ్యారు. అక్కడ 'ఓంకార' అనే పేరుతో కూచిపూడి డ్యాన్స్ స్కూల్‌ని నడిపారు. ఇప్పటికీ తనకు నటనపై మక్కువ తగ్గలేదని, ఆ ప్యాషన్‌తోనే మళ్లీ టాలీవుడ్‌కి రావాలనుకుంటున్నానని చెబుతున్నారు ప్రశాంతి హారతి. 'పెళ్లాయ్యాక యూఎస్‌లో సెటిల్ అయ్యాను. అక్కడి పిల్లలకు మన శాస్త్రీయ నృత్యాన్ని నేర్పుతున్నాను. నా కూతురు తాన్య కూడా నా స్టూడెంటే. తనకు నటనంటే ఇంట్రెస్ట్ ఉంది. తనకిప్పుడు 16ఏళ్లు. తన వయసుకు తగ్గ పాత్రలు లభిస్తే ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని తెలిపారు ప్రశాంతి హారతి. మంచి పాత్రలు లభిస్తే నటించాలని ఉందని, సినిమాలతోపాటు ఓటీటీ వెబ్‌సిరీస్, షార్ట్ ఫిల్మ్స్‌లో నటించాలని ఉందని, అందుకే హైదరాబాద్‌లో అందుబాటులో ఉండాలనుకుంటున్నానని ప్రశాంతి హారతి తెలిపారు.

# కథ విని షాక్‌లో ఉండిపోయా



' ఇందులో పిల్లల్ని తల్లిదండ్రులు ఎలా పెంచకూడదో చూపించాం. ఎలా పెంచితే పిల్లలు ఎలా తయారవుతారో చూపించాం. ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన సినిమా ఇది. థ్రిల్లర్, సస్పెన్స్ మాత్రమే కాకుండా అద్భుతమైన సెంటిమెంట్ కూడా ఈ సినిమాలో ఉంటుంది' అని హీరో విశ్వ కార్తికేయ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'కలియుగపట్టణంలో'. ఆయూషి పటేల్ కథానాయిక. రమాకాంత్‌రెడ్డి దర్శకుడు. డాక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ నిర్మాతలు. ఈ నెల 29న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో విశ్వకార్తికేయ విలేకరులతో ముచ్చటించారు. నంద్యాల నేపథ్యంలో ఈ కథ జరుగుతుందని, ప్రతి మనిషిలో ఉండే భిన్నమైన కోణాలను చూపించేలా ఈ సినిమా ఉంటుందని, ఇందులోని తన పాత్రలో విభిన్నమైన కోణాలుంటాయని, ఈ పాత్ర పోషణకోసం చాలా రీసెర్చ్ చేశానని విశ్వ కార్తికేయ చెప్పారు. కథనాయిక ఆయూషి తెలుగు అమ్మాయి కావడం చేత తన పాత్రలోని భావాన్ని సులభంగా అర్థం చేసుకుందని, నా పాత్రతో సమానమైన ప్రాధాన్యత తన పాత్రకూ ఉంటుందని ఆయన అన్నారు. దర్శకుడు రమాంకాంత్‌రెడ్డి ఈ కథ చెప్పినప్పుడు కాసేపు అదే షాక్‌లో ఉండిపోయానని, స్క్రీన్‌ప్లేతో కట్టిపడేశాడనీ, టెక్నికల్‌గా సినిమా ఎంతో బావుంటుందనీ, పాటలు, ఆర్ఆర్, కెమెరా వర్క్ అన్నీ నెక్ట్స్ లెవల్లో ఉంటాయని విశ్వకార్తికేయ చెప్పారు. ఓ ఇండోనేషియా ప్రాజెక్ట్ చేస్తున్నాననీ, మంత్రతంత్రాలు, చేతబడుల నేపథ్యంలో సినిమా ఉంటుందని ఆయన తెలిపారు.